సాక్షి చిత్తూరు

గురువారం, 2, ఫిబ్రవరి, 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,000

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	31	20
తిరుపతి	32	21
తిరుమల	27	16
గూడూరు	32	23
నగరి	32	22



ఘనంగా భీష్మ ఏకాదశి

శ్రీకాళహస్తి: భీష్మ ఏకాదశి వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం చేసి, చప్పరాలపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు సత్యవేడు విద్యార్థి



విష్ణు

సత్యవేడు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి డి.విష్ణు జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయని భారతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విష్ణు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు.

కౌన్సిలర్‌కు షోకాజ్ నోటీసులు

కుప్పం: మున్సిపాలిటీ రెండవ కౌన్సిలర్ మునిరాజుకు మున్సిపల్ చైర్మన్ సుధీర్ షోకాజ్ నోటీసులు అందజేశారు. మున్సిపాలిటీలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాయిదాకు కారణమైన 2వ వార్డు కౌన్సిలర్ మునిరాజుకు షోకాజ్ నోటీసులు అందజేశారు. తాగునీటి సమస్య పరిష్కరించలేదని, అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు మినిట్ పుస్తకాన్ని సైతం చించివేసి సభా మర్యాదలను పాటించకుండా ప్రవర్తించడంపై చైర్మన్ సుధీర్ నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని లేని పక్షంలో తగు చర్యలు తీసకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



వెండర్స్‌తో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్ పేపర్స్‌ను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం స్టాంప్ వెండర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కుప్పంలో అధిక ధరలకు స్టాంప్ పేపర్స్‌ను విక్రయించిన వెండర్స్ లైసెన్సులను తాత్కాలికంగా సస్పెండ్ చేసిన విషయం గుర్తు చేశారు. వెండర్స్ స్టాంప్ పేపర్స్ విక్రయాల వివరాలు సక్రమంగా ఉండాలన్నారు. అధిక ధరలకు అమ్మడమే లక్ష్యంగా ఉండరాదని చెప్పారు. సబ్‌రిజిస్ట్రార్లు అమ్మకాల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో భూ విలువల పరిశీలన, ఈకేవైసీ చేయడం, ఫొటోలు తీయడం, రిజిస్టర్ నమోదు చేయడం ఇతర అంశాలపై జిల్లా రిజిస్ట్రారు వారికి అవగాహన కల్పించారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీని బుధవారం చురుగ్గా చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల మొత్తాలను అందించారు. ఈ నెలకు మొత్తం 2,63,901 మందికి పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో సాయంత్రానికి 2,40,325 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ల మొత్తాలను అందించి 91.07 శాతం పూర్తి చేశారు. అనారోగ్యంతో ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు వలంటీర్లు నేరుగా ఆస్పత్రుల్లోనే పింఛన్ల మొత్తాలను అందించారు. మరో రెండు రోజులపాటు పింఛన్ల పంపిణీని కొనసాగించి వందశాతం లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు.

సీఐలకు స్థానచలనం

చిత్తూరు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పుంగనూరు అర్బన్ సీఐగా పనిచేస్తున్న గంగిరెడ్డిని చిత్తూరు తాలూకాకు, చిత్తూరు తాలూకాలో పనిచేస్తున్న మద్దయ్య ఆచారిని చిత్తూరు టూ టౌన్‌కు బదిలీచేశారు. పుంగనూరు రూరల్ సీఐగా ఉన్న మధుసూదన్ రెడ్డి అదనంగా పుంగనూరు అర్బన్ బాధ్యతలు చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తమ్ముడు, చెల్లెలికి అన్నం తినిపిస్తున్న ప్రతిజ్ఞ

విధి విసిరిన సవాల్‌కు బెదర లేదు.. ప్రకృతి ప్రకోపానికి భయపడలేదు.. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా కుంగిపోలేదు. తల్లిదండ్రులు చెంతలేరని చింతించలేదు. కన్నవారు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. పట్టుమని పదేళ్లు కూడా లేని తోబుట్టువులకు అన్నీ తానై ఆప్యాయతలు కురిపిస్తోంది. అమ్మలా లాలిస్తూ.. నాన్నలా అనురాగాన్ని పంచుతూ.. తనూ చదువుకుంటూ, పసివాళ్లకు కొండంత అండగా నిలుస్తోంది. అమ్మచేత గోరుముద్దలు తింటూ.. చందమామ కథలు వింటూ హాయిగా గడపాల్సిన వయసులో కుటుంబ బరువు, బాధ్యతలు మోస్తూ శభాష్ అనిపించుకుంటోంది. తల్లిదండ్రులు పక్క రాష్ట్రంలో కూలి పనులు చేస్తుండగా విధిలేని పరిస్థితుల్లో ఏడాదిన్నరగా చెల్లీతమ్ముడితో కలిసి మొక్కవోని ధైర్యంతో ముందడుగు వేస్తున్న తీరు పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఆ చిట్టితల్లి జీవన స్థితిగతులపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..

సాక్షి ఫోకస్

అమ్మానాన్నను మరిపిస్తూ.. అనురాగం కురిపిస్తూ..

- కుటుంబాన్ని కష్టాల్లోకి నెట్టిన కరోనా
- అప్పు తీరక హైదరాబాద్‌లోనే తల్లిదండ్రులు
- చెల్లి, తమ్ముడి బాధ్యతను మోస్తున్న చిట్టితల్లి
- చదువుకుంటూ.. తోబుట్టువులను చదివిస్తున్న చిన్నారి
- అండగా నిలుస్తున్న ప్రభుత్వ పథకాలు

నగరి: మండలంలోని ముడిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన సాగర్, సెల్వి దంపతుల కుమార్తె ప్రతిజ్ఞ (12) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. బాలిక తమ్ముడు సుదీప్‌కుమార్ (7) 2వ తరగతి, చెల్లెలు మధుర (4) అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్నారు. వీరు ముగ్గురూ ఏడాదిన్నరగా ముడిపల్లె ఎస్టీ కాలనీలో ఓ గుట్టపై ఉన్న చిన్న ఇంట్లో నివాసముంటున్నారు.

అమ్మలాంటి అక్క

ప్రస్తుతం ఈ కుటుంబ పెద్ద దిక్కు ప్రతిజ్ఞ. ఉదయం ఐదింటికే నిద్రలేచింది మొదలు పడుకునేవరకు తమ్ముడు, చెల్లి ఆలనాపాలనా చూస్తోంది. ఇల్లూవాకిలీ శుభ్రం చేయడం.. పాత్రలు కడిగి తెలిసిన వరకు వంట చేయడం.. వేడినీళ్లు కాగబెట్టి తమ్ముడు, చెల్లికి స్నానాలు చేయించడం.. పౌడర్ కొట్టి అందంగా ముస్తాబు చేసి బడికి తీసుకెళుతోంది. సాయంత్రం బడి నుంచి వచ్చిన వెంటనే మళ్లీ ఇంటి పని చేసుకుని.. తోబుట్టువులతో హోంవర్క్ పూర్తి చేయించడమే కాకుండా.. తానూ చక్కగా చదువుకుంటోంది.

బాధ్యతలన్నీ తనపైనే

ఇంట్లో సరుకులు తెచ్చుకోవాలన్నా.. కొత్తదుస్తులు కొనాలన్నా.. పండుగపబ్బాలకు ఏవైనా తీసుకురావాలన్నా.. అన్నీ తానై వ్యవహరిస్తోంది ప్రతిజ్ఞ. తన అత్తతో కలిసి ఐదు కిలోమీటర్ల దూరంలోని నగరి వారపు సంతకు వెళ్లి కూరగాయలు తెచ్చుకుంటోంది. తోబుట్టువులకు ఆరోగ్య సమస్యవస్తే ఆస్పత్రికి తీసుకెళ్తూ అమ్మానాన్నలా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. తనకు వినికిడి సమస్య ఉన్నా, తోబుట్టువులను కంటికి రెప్పలా కాపాడుకుంటోంది



ఇంటి వద్ద వంట చేస్తున్న ప్రతిజ్ఞ

హైదరాబాద్‌లో తల్లిదండ్రులు

ప్రతిజ్ఞ తండ్రి సాగర్ పెయింటర్. అరకొర సంపాదన కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. ఈ నేపథ్యంలో ఐదేళ్ల క్రితం కుటుంబంతో సహా హైదరాబాద్‌కు మకాం మార్చాడు. అక్కడ ఒక కాంట్రాక్టరు వద్ద భార్యతో పాటు పెయింటింగ్ పనుల్లో కూలీగా చేరాడు. అక్కడే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. ఇలా సాఫీగా సాగుతున్న వారి సంసారాన్ని కరోనా రక్కసి కష్టాల్లోకి నెట్టింది. ఆ తర్వాత పనుల్లేక తల్లడిల్లిపోవాల్సి వచ్చింది. విధిలేని పరిస్థితుల్లో మళ్లీ స్వగ్రామానికి రావాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కాంట్రాక్టర్ వద్ద అప్పు తీరకపోవడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో పిల్లలు ముగ్గురినీ సొంత ఊరికి పంపి.. నెలకో, రెండు నెలలకోసారి వచ్చి బియ్యం, పప్పు దినుసులు, కొంత నగదు ఇచ్చి వెళ్లిపోతున్నారు. మరో రెండేళ్లపాటు పనిచేస్తేగానీ అప్పుతీరని పరిస్థితిలో కన్నపేగును దూరం చేసి కుమిలిపోవాల్సి వస్తోంది.



చిట్టి చేతులకు కొండంత అండ

ఏడాది క్రితం నుంచి స్వగ్రామంలో ఉన్న ఈ చిన్నారులకు పాఠశాలలో ఒకపూట మధ్యాహ్న భోజనం అందుతోంది. ఇదిగాక యూనిఫాం, పుస్తకాలు, అంగన్‌వాడీ ద్వారా గుడ్లు, ఇతర సామగ్రి వస్తుండడం కాస్త ఆదరువుగా నిలుస్తోంది. గ్రామ వలంటీర్ వీరిని గుర్తించి ఇప్పటికే ఆధార్ కార్డు ఇప్పించారు. రేషన్ కార్డుకు సైతం దరఖాస్తు చేయించారు. అది వచ్చిన తర్వాత వీరి సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి దరఖాస్తు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. వచ్చే ఏడాది పిల్లల్లో ఒకరికి అమ్మఒడి అందనుంది. ఇటీవల వచ్చిన తుపానుకు చిన్నారులు ఉన్న ప్రాంతం ముంపునకు గురికావడంతో ప్రభుత్వం తరఫున కూరగాయలు, వంట సామగ్రితోపాటు ఆర్థిక సాయం అందింది.

భయపెట్టిన తుపాను



తుపాను బాధిత సాయం అందుకుంటున్న ప్రతిజ్ఞ

గత ఏడాది వచ్చిన మాండూస్ తుపానుతో ముడిపల్లె ఎస్టీ కాలనీ అతలాకుతలమైంది. ఇళ్లు మునిగిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రతిజ్ఞ ఉంటున్న ఇంటి పైకప్పు సైతం దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా తమ్ముడు, చెల్లిని రెక్కలకింద పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వచ్చింది. అప్పుడప్పుడూ ఇంటికి సమీపంలోనే ఉన్న మేనత్త వచ్చి సాయం అందించేది. తిండికూడా సరిగా వండుకునే పరిస్థితి లేకపోవడంతో అర్ధాకలితోనే అలమటించినట్టు ప్రతిజ్ఞ చెబుతోంది.

అమ్మలా చూసుకుంటోంది



అక్క ప్రతిజ్ఞ ఉదయాన్నే లేచి ఇంటిని శుభ్రం చేసి నన్ను నిద్ర లేపుతుంది. చదువుకోమని చెప్పి తాను స్నానం చేసి వంట సిద్ధం చేస్తుంది. నేను స్నానం చేసి వచ్చేలోపు అన్నం చేసి తినిపిస్తుంది. తనే దగ్గరుండి పాఠశాలకు తీసుకెళ్లి వదలిపెడుతుంది. మళ్లీ పాఠశాల వదిలే సమయంలో నన్ను ఇంటికి తీసుకువస్తుంది. రాత్రి పూట అన్నం తినిపిస్తుంది. జ్వరం వస్తే ఆస్పత్రికి తీసుకెళ్తుంది. అప్పుడప్పుడూ అమ్మా, నాన్న వస్తారు. అప్పటి వరకు అక్కే చూసుకుంటుంది.

-సుదీప్‌కుమార్

అక్కే స్నానం చేయిస్తుంది



నాకు అక్కే స్నానం చేయిస్తుంది. బట్టలు తొడుగుతుంది. అన్నం తినిపిస్తుంది. రాత్రిళ్లు నేను పక్క తడిపేస్తే ఆ దస్తులను కూడా తనే ఉతుకుతుంది. రాత్రిళ్లు భయపడితే పక్కనే పడుకోనిచ్చి నిద్రపుచ్చుతుంది. అక్కే అమ్మలా అన్నీ చూస్తోంది. మాకు అమ్మా నాన్న లేరనే దిగులు లేకుండా చూసుకుంటోంది.

- మధుర

అమ్మతో ఉంటూ అలా నేర్చుకున్నా..



రోజూ పెయింటింగ్ పనులకు వెళ్లి వచ్చి మణికట్టు, చేతుల నొప్పితో అమ్మ చాలా బాధపడేది. చేతులు ఒత్తుకుంటూ కన్నీరు పెట్టేది. ఆ బాధ చూసి ఆమెకు వంటచేసే సమయంలో, ఇతర పనుల్లో సాయంగా ఉండేదాన్ని. అలా వంటావార్పు నేర్చుకున్నా. ఇంటి పనులు ఎలా చేయాలో తెలుసుకున్నా. తమ్ముడు, చెల్లెల్ని నేనే చూసుకుంటా. ఏవైనా సమస్యలు వస్తే తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెబుతుంటా.

- ప్రతిజ్ఞ, ముడిపల్లె ఎస్టీ కాలనీ

నాలుగు నెలల్లో వచ్చేస్తాం

హైదరాబాద్‌లో నేను, నా భర్త పెయింటింగ్ కాంట్రాక్టు వర్కులు తీసుకొని చేస్తున్నాం. కరోనా సమయంలో తీసుకున్న కాంట్రాక్టులు చేయలేక పోయాం. ప్రస్తుతం ఆ పనులు పూర్తి చేస్తున్నాం. నాలుగు నెలల్లో కాంట్రాక్టర్ వద్ద పని అయిపోతుంది. ముడిపల్లెకు వచ్చేస్తాం. పొదుపు చేసిన డబ్బులు కొంత ఇంటి నిర్మాణానికి వాడుకుంటాం. నగరి పరిసర ప్రాంతాల్లో పెయింటింగ్ పనులకు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం.

- సెల్వి, ప్రతిజ్ఞ తల్లి

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రిక్తహస్తం

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ నిరాశ కలిగించింది. కేంద్ర బడ్జెట్ వస్తే ఏదో మేలు జరుగుతుందని అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే ప్రత్యేకంగా చిత్తూరు జిల్లాకు కేటాయింపులు లేకపోవడం గమనార్హం. బుధవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ అందరినీ పూర్తిగా నిరాశపరిచింది. కేవలం కొన్ని వస్తువులపై ధరలు తగ్గనుండగా, మరికొన్ని వస్తువులపై ధరల ప్రభావం పడనుంది. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు.

వేతనజీవులకు ఊరట

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ ఊరటనిచ్చింది. ప్రస్తుతం ఉన్న రూ.5లక్షల ఆదాయ పరిమితిని రూ.7 లక్షలకు పెంచడంతో మేలు కలుగుతుందని వేతన జీవులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే పన్ను మినహాయింపు రూ.50 వేల నుంచి 5లక్షలకు పెంచాలన్న డిమాండ్‌ను మాత్రం నెరవేర్చలేదు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న దాదాపు 50 వేల మంది ఉద్యోగుల్లో 80 శాతం మందికి మేలు కలగనుంది. ప్రస్తుతమున్న 6 శ్లాబులను 5 శ్లాబులకు తగ్గించడంతో ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం తరహాలోనే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లోనూ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిచ్చారు. తిరుపతి జిల్లాలో బుచ్చినాయుడు కండ్రిగలో ఉన్న ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఉద్యోగుల కొరత తీరనుంది. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకానికి నిధులు కేటాయించారు.

నెరవేరని డిమాండ్లు

- 112 ఏళ్ల చరిత్ర గల చిత్తూరులో కేంద్రీయ విద్యాసంస్థ, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు ఊసే లేదు.
- తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు జిల్లా అయినప్పటికీ కొత్త రైళ్లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లను చిత్తూరులో ఆపాలన్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోలేదు.
- చిత్తూరు–కాట్పాడి వరకు రైల్వేలైన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు.
- చిత్తూరు – చెన్నైకి కొత్త రైలు ప్రతిపాదనకు మోక్షం లేదు.
- తిరుపతి జిల్లా కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదు.
- రేణిగుంట సీఆర్‌ఎస్ బలోపేతం, తిరుపతి రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో ఆధునికరిస్తామని ప్రకటించారేగానీ ఇంతవరకు నిధులు మాత్రం ఇవ్వలేదు.

ఉద్యోగులకు నిరాశ



వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ వల్ల పెద్దగా ఒరిగింది ఏమీలేదు. గతంతో పోల్చితే రూ.50వేలు మాత్రమే పన్ను మినహాయింపు ఇచ్చారు. పెరిగిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా 5 లక్షల వరకు పన్ను మినహాయించాలనే మెజారిటీ ఉద్యోగుల డిమాండ్‌ను పట్టించుకోలేదు. కేవలం పన్ను ఆదాయ పరిమితిని మాత్రమే పెంచారు.

– జీవీ రమణ, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి, చిత్తూరు

తిరుపతి జిల్లాకు ఒరిగిందేమిటి?



కేంద్ర బడ్జెట్ వల్ల తిరుపతి జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్యాసంస్థల పనిని వేగవంతం చేసేందుకు, ఆధునికరించేందుకు కేటాయింపులు లేకపోవడం దురదృష్టకరం. భక్తుల అవసరాలకు అనుగుణంగా రైళ్లు పెంచడంలో కానీ, సౌకర్యాలు పెంచడంలో కానీ శ్రద్ధ చూపలేదు.

– వి. నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి

చిత్తూరు జిల్లాకు మొండిచేయి



పార్లమెంట్లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఏ మాత్రం లాభం చేకూరలేదు. రాష్ట్రంలో భారీ ప్రాజెక్ట్ అయిన పోలవరం డ్యాంకి నిధులు కేటాయించకపోవడం అన్యాయం. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదు. చిత్తూరు జిల్లాలో కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరం.

– ఎస్.నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి, చిత్తూరు

లోకేష్‌ది ఒంటరిగళం

- తండ్రి సీఎంగా ఉండి కొడుకు ఓడిపోవడం దేశంలోనే రికార్డు
- రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ఆర్‌కే రోజా



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రోజా

చిత్తూరు రూరల్: లోకేష్‌ది యువగళం కాదు.. ఒంటరిగళం.. ఆయనచుట్టూ ఉన్న గన్‌మెన్లు, రోప్ పార్టీ తీయిస్తే.. మిగిలింది పది మంది మాత్రమేనని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ఆర్‌కే రోజా అన్నారు. చిత్తూరులో బుధవారం మంత్రి మీడియాతో ఏమన్నారంటే.. ''యువగళంలో లోకేష్ ఒంటరివాడయ్యారు. పోలీసుల బందో బస్తు తీయిస్తే యాత్రలో పదిమంది కూడా ఉండరు. పప్పు లీడర్‌గా వంద శాతం ఫెయిల్యూర్. ఇది మంగళగిరి ప్రజలకు ఎప్పుడో తెలుసు.. అందుకే లోకేష్‌ను ఓడించి పంపించారు. ఎక్కడైనా సీఎంగా ఉన్న వ్యక్తి కొడుకు ఓడిపోవడం చూశారా. ఆ ఒక్క రికార్డు పప్పుకే దక్కింది. ఎక్కడ అడుగుపెడితే అక్కడ ఐరన్‌లెగ్ టాక్. పాదయాత్రలో ఒక్కోరోజు ఒక్కో సంఘటన ఎదురవుతోంది. ప్రజలు కూడా భయపడుతున్నారు. మూన్నాళ్ల ముచ్చటైన ఈ యాత్రను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసమే ముఖ్యమంత్రి అయ్యారు. సీఎం, ప్రజల ఆశీర్వాదంతో మేమంతా ఎమ్మెల్యేలు.. మంత్రులయ్యాం. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పప్పు లాంటి వ్యక్తులకు బుద్ధి చెప్పే కార్యక్రమం. చంద్రబాబు ఈ రాష్ట్రాన్ని దోచుకుని హైదరాబాద్‌లో దాచుకున్నది చాలక.. మళ్లీ దోచుకోవడానికి ఒక్క అవకాశం కావాలంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 3600 కి.మీ. పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకుని భరోసా కల్పించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తి చేశారు.'' అని మంత్రి స్పష్టం చేశారు.

రైల్వే ట్రాక్ భూములకు పరిహారం

- ప్రతిపాదనలకు సిద్ధం చేయండి
- ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం
- జిల్లా కలెక్టర్ హరినారాయణన్



రైల్వేట్రాక్ ఏర్పాటు ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

కుప్పం: కుప్పం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మారికుప్పం వరకు నూతనంగా ఏర్పాటు చేయనున్న రైల్వే ట్రాక్‌కు సంబంధించి భూసేకరణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేందకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆయన బుధవారం గుడుపల్లె మండలం రైల్వేట్రాక్‌కు భూసేకరణ స్థలాలు, కుప్పం మండలంలో హార్టికల్చర్ హబ్, దాసేగానూరు, కమతమూరు గ్రామాల్లో ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం–మారికుప్పం రైల్వేట్రాక్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కుప్పం నుంచి 12 కిలోమీటర్లు నూతన రైల్వేట్రాక్ ఏర్పాటయ్యే నక్కనపల్లి, అగరం, బిసానత్తం ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గుడుపల్లె మండలంలో 238 ఎకరాలు, కుప్పం మండలంలో 9 ఎకరాలు రైల్వేలైన్లను తీసుకోవడంతో పలువురు రైతులు భూములు కోల్పోయినట్లు రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కుప్పం మండలం దాసేగానూరు, కమతమూరులోని ఉద్యాన పంటలు, హార్టికల్చర్ హబ్‌ను ఆయన సందర్శించారు. రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే విధంగా ఎలాంటి పంటలు సాగు చేయాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. పండ్ల తోటల విస్తరణ పథకం ద్వారా దాసేగానూరు గ్రామంలో సాగవుతున్న బొప్పాయి పంటలను పరిశీలించారు. ఈ పంట సాగుకు 50 శాతం సబ్సిడీ, హెక్టార్‌కు మెదటి సంవత్సరం రూ.10 వేలు, రెండవ సంవత్సరం రూ.12 వేలు ఉద్యాన సమగ్ర అభివృద్ధి పథకం ద్వారా సంబంధిత రైతులకు అందిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా దానిమ్మ పంట దిగుబడి సమయంలో పక్షుల నుంచి కాపాడుకునేందుకు యాంటీ బర్డ్ నెట్ ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీతో రూ.32 వేలకే సంబంధిత రైతులకు అందిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు వివరించారు. దీంతో రైతులను ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సహించాలని ఉద్యానశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం హార్టికల్చర్ హబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఆర్‌డీఓ శివయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంగట్టుపై నడుస్తూ..



రైతుల సమస్యలు తెలుసుకునేందుకు కలెక్టర్ హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పొలంగట్టుపై నడిచారు. కుప్పం మండలం దాసిగానూరు గ్రామం వద్ద పొలం గట్టుపై బుధవారం నడుచుకుంటూ వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ రైతు కేశవులు పండిస్తున్న బొప్పాయి పంటను, పూల తోటను పరిశీలించారు. – చిత్తూరు కలెక్టరేట్

జాతీయ స్థాయి త్రోబాల్‌కు ముగ్గురు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సదుం: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చెరుకువారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ చిన్నప్ప బుధవారం తెలిపారు. నంద్యాల జిల్లాలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన అంతర్ జిల్లా అండర్ 14 బాల, బాలికల త్రోబాల్ పోటీల్లో విద్యార్థులు చైతన్య, భానుప్రసాద్, మునిశ్రీజ ప్రతిభ చూపారని ఆయన చెప్పారు. దీంతో త్వరలో జరిగే నేషనల్స్‌లో రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. విద్యార్థులను పాఠశాల బృందం అభినందించింది.

హోరాహోరీగా సాక్షి ప్రీమియర్ లీగ్

- రెండో రోజు కొనసాగిన జోరు
- 26 బంతుల్లో 53 పరుగులు చేసిన చైతన్య



తుమ్మలగుంట క్రీడా మైదానంలో సాగుతున్న ఎస్పీఎల్ క్రికెట్ మ్యాచ్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట వద్ద నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం క్రికెటర్లు అదే జోరును కొనసాగించారు. రెండు మైదానాల్లో నిర్వహించిన 6మ్యాచ్‌ల్లో 12జట్లు తలపడ్డాయి. బ్యాట్స్‌మెన్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ సిక్స్‌లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. చూడ చక్కని షాట్లతో మంచి ఇన్నింగ్స్ నిర్మిస్తూ భారీ స్కోరును ప్రత్యర్థి జట్టు ముందుంచారు. వీరికి తోడుగా బౌలర్లు పదునైన బంతులతో క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ పరుగులు కట్టడి చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు.

గ్రౌండ్ 1లో..

- మొదటి మ్యాచ్‌లో వీఆర్ఎస్ ఎంబీఏ కళాశాల జట్టుపై ఎస్వీసీఈ-1 జట్టు 6వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన వీఆర్ఎస్ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 80పరుగులు చేసింది. తరువాత ఎస్వీసీఈ-1 జట్టు 8 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 81పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఎస్వీసీఈ-1 జట్టు బ్యాట్స్‌మన్ తరుణ్‌రాజ్ 21 బంతుల్లో 6ఫోర్లు, 1సిక్సర్‌తో 42 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్‌లో శ్రీరామ ఇంజినీరింగ్ జట్టుపై చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 28 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన చదలవాడ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 108 పరుగులు చేయగా, శ్రీరామ జట్టు 10ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసి ఓటమిని మూటగట్టుకుంది.
- మూడో మ్యాచ్‌లో ఎస్వీసెట్ జట్టుపై శ్రీవిద్యానికేతన్ జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విద్యానికేతన్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాట్స్‌మన్ చైతన్య మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 26 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 53 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్వీసెట్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేసింది.

గ్రౌండ్ 2లో..

- మొదటి మ్యాచ్‌లో శ్రీరామ జట్టుపై ఎస్వీఈసీ-2 జట్టు 31 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీఈసీ-2 జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేయగా, శ్రీరామ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 75 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.
- రెండో మ్యాచ్‌లో ఎస్వీసీఈ జట్టుపై శ్రీవిద్యానికేతన్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ జట్టు 7 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీవిద్యానికేతన్ జట్టు 7 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి అలవోకగా గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో విద్యానికేతన్ జట్టు బ్యాట్స్‌మన్ శివాజీ 21 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 పరుగులు చేశాడు.
- మూడో మ్యాచ్‌లో పలమనేరు మదర్ థెరిస్సా కళాశాల జట్టుపై పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిద్ధార్థ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేయగా, మదర్ థెరిస్సా జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 53 పరుగులు మాత్రమే చేసింది.

SAKSHI PREMIER LEAGUE

గెలుపొందిన జట్లు

గ్రౌండ్-1
- ఎస్వీసీఈ-1
- చదలవాడ ఇంజనీరింగ్ కళాశాల
- శ్రీవిద్యానికేతన్

గ్రౌండ్-2
- ఎస్వీఈసీ-2
- శ్రీవిద్యానికేతన్
- పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల


గెలుపొందిన ఎస్వీసీఈ-1 జట్టు


సత్తా చాటిన విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు


విజయం సాధించిన ఎస్వీసీఈ-2 జట్టు


ప్రతిభ చూపిన చదలవాడ ఇంజనీరింగ్ కళాశాల జట్టు


గెలుపొందిన విద్యానికేతన్ కళాశాల జట్టు


గెలిచిన పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

రేడియేటర్ పేలి ఇద్దరికి గాయాలు

కుప్పంరూరల్: ఆర్టీసీ బస్సులో రేడియేటర్ పేలి కూలెంట్ ఆయిల్ బయటికి రావడంతో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుప్పం – తిరుపత్తూరు మధ్య తిరుగుతున్న ఆర్టీసీ బస్సు బుధవారం తిరుపత్తూరు వెళ్లి కుప్పంకు బయల్దేరింది. మార్గ మధ్యం మల్లానూరు వద్దకు చేరుకోగానే రేడియేటర్ నుంచి ఉన్నట్టు ఉండి కూలెంట్ ఆయిల్ బయటికి వచ్చింది. ఈ ఆయిల్ చిమ్ముకుని డ్రైవర్ సంపంగి, పక్కనే ఉన్న ప్రయాణికురాలు గొల్లపల్లికి చెందిన ధనలక్ష్మీపై పడింది. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన వారిద్దరినీ కుప్పం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి

శాంతిపురం: పాలారు నదిలోని చెక్ డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. కడపల్లికి చెందిన అవివాహితుడు కుమార్(33) బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. మూర్ఛ వ్యాధి ఉన్న కుమార్ నీటిలో ఉన్న సమయంలో మూర్ఛ రావటంతో నీట మునిగిపోయాడు. సమీపంలోని వారు గమనించి నీటి నుంచి బయటకు తీసేలోపే ప్రాణాలు విడిచాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జాతీయ పోటీలకు అడవిబూదుగూరు విద్యార్థిని


జాతీయ పోటీలకు ఎంపికైన మీనా తో ఉపాధ్యాయులు

కుప్పంరూరల్: మండలంలోని అడవిబూదుగూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న మీనా ఫుట్‌బాల్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటనాగేశ్వర్ తెలిపారు. గత నెల 27 నుంచి 31వరకు ఎర్రగుంట్లలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్ -17 పోటీల్లో మీనా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మీనాను అభినందించారు.

రోడ్డుపైనే పడిపోయిన చెరుకు ట్రాక్టర్



శ్రీరంగరాజపురం : మండలంలోని కొత్తపల్లి మిట్ట నుంచి సుగర్ ఫ్యాక్టరీ తరలిస్తున్న చెరుకు ట్రాక్టర్ బుధవారం ఓవర్ లోడుతో కొత్తపల్లి మిట్ట జెస్సీ డెయిరీ వద్ద రోడ్డుపైనే పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నందున సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ సత్తా



ఉత్తీర్ణులైన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఫలితాల్లో తిరుపతి 'ఎమరాల్డ్స్' విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులైనట్లు సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మొత్తం 400 మార్కులకు గాను కె.మునివర్షిత-342, డి.రేవంత్-338, కె.సృజనాఠాగూర్- 338, కె.బిందుశ్రీ-330, పి.ముస్కాన్-328, జి.శిరీష- 326 మార్కులు సాధించినట్లు వివరించారు.

చిత్తూరులో లలితా జ్యువెలరీ షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రిబ్బన్ కట్ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

చిత్తూరు రూరల్: చిత్తూరు వేలూరు రోడ్డులో బుధవారం లలితా జ్యువెల్లరీ షోరూం ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. దీనికి రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి షోరూం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ ఘనస్వాగతం పలికారు. రిబ్బన్‌కట్ చేసి షోరూంను ప్రారంభించారు. అనంతరం వారు బంగారం, వెండి, వజ్ర ఆభరణాలను పరిశీలించారు. మంత్రులు, చైర్మన్ మాట్లాడుతూ లలితా జ్యువెలరీ 46వ షోరూం చిత్తూరులో ప్రారంభమైందన్నారు. తయారీ ధరకే బంగారం, వజ్రాభరణాలను అందించనున్నట్లు తెలిపారు. తక్కువ తరుగు, తక్కువ ధరకు నగలు విక్రయించాలన్న ఉద్దేశంతోనే షోరూంను ప్రారంభించారన్నారు. నాణ్యతకు లలితా షోరూమ్స్ చిరునామాగా మారాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెత్తందార్ల కోసం చంద్రబాబు ఆరాటం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వ్యాఖ్య

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం పథకాలు అందిస్తుంటే, చంద్రబాబు కోటీశ్వరులు, పెత్తందార్ల కోసం ఆరాట పడుతున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆరోపించారు. ఆయన బుధవారం మండలంలోని మారేపల్లెలో మీడియాతో మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు అమలు చేయని పథకాలను సీఎం జగన్ చేస్తున్నట్లు తెలిపారు. పేదవాడు ఎప్పటికీ పేదవాడుగానే మిగిలిపోవాలన్న దుర్బుద్ధితో చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 2024లో పెత్తందార్లకు పేదవారికి మధ్య పోరాటం జరుగుతుందని వ్యాఖ్యానించారు. సీఎం జగన్‌కు ద్రోహం చేసిన వారు రాజకీయ సన్యాసం తీసుకున్నారని గుర్తు చేశారు. పందులు అంతా కలిసి గుంపుగా వచ్చినా జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేదని స్పష్టం చేశారు. పేద ప్రజలందరూ జగన్‌ను దేవుడిలా చూస్తూ ఆయనకు మద్దతు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ప్రజా బలం ఉన్న నేతను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, మండల అధ్యక్షుడు ధనంజయరెడ్డి, ఎంపీటీసీలు మురళీరెడ్డి, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సర్పంచ్‌లు అన్నురాశి, గోవిందయ్య, నాయకులు గురవారెడ్డి, భీమశంకర్‌రెడ్డి, రాణెమ్మ, రవి పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి పరిష్కరించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరి నారాయణన్


సమీక్షలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో నమోదయ్యే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం రాత్రి పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలిచ్చే అర్జీలను వీలైనంత వరకు అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా, మండల, గ్రామ సచివాలయాలలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో నమోదయ్యే అర్జీలను ఆడిట్ టీం 24 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. 24 గంటల్లోగా ప్రజల అర్జీలకు ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా పంపాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఇంటిగ్రేటెడ్ కుల ధృవీకరణ మంజూరులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు అర్హత ఉన్న వారి పేర్లను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్ సమీక్షలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీవో రవికుమార్, మెడికల్ ఆఫీసర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

అండర్‌-19 ప్రపంచకప్‌ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్‌-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్‌ చేతుల మీదుగా అండర్‌-19 జట్టు కెప్టెన్‌ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్‌'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.



గిల్‌ జిగేల్‌...



గిల్‌

- భారత ఓపెనర్‌ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2–1తో సిరీస్‌ సొంతం

అహ్మదాబాద్‌: మోదీ స్టేడియంలో భారత్‌ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' శుబ్‌మన్‌ గిల్‌ (63 బంతుల్లో 126 నాటౌట్‌; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్‌ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2–1తో సిరీస్‌ గెలుచుకుంది. మొదట భారత్‌ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్‌ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్‌ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద సిరీస్‌' హార్దిక్‌ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్‌ విధ్వంసం

ఇషాన్‌ కిషన్‌ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్‌, త్రిపాఠి కివీస్‌ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్‌ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్‌ (13 బంతుల్లో 24; 1 ఫోర్‌, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్‌ స్కోరు 156/3. శుబ్‌మన్‌ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్‌ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్‌ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్‌... లిస్టర్‌, టిక్నర్‌, ఫెర్గూసన్‌ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్‌ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్‌ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్‌) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్‌ పేస్‌కు కివీస్‌ బ్యాటర్స్‌ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్‌ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్‌ విజయానికి బాటపడింది. మిచెల్‌, సాన్‌ట్నర్‌ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.



సిరీస్‌ ట్రోఫీతో కెప్టెన్‌ హార్దిక్‌

స్కాన్‌ చేయండి
ఈ రోజు హైలైట్‌ కొరకు

స్కోరు వివరాలు

భారత్‌ ఇన్నింగ్స్‌: ఇషాన్‌ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్‌ 1; గిల్‌ (నాటౌట్‌) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్‌ (బి) సోధి 44; సూర్యకుమార్‌ (సి) బ్రేస్‌వెల్‌ (బి) టిక్నర్‌ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్‌ (బి) మిచెల్‌ 30; హుడా (నాటౌట్‌) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1–7, 2–87, 3–125, 4–228.
బౌలింగ్‌: లిస్టర్‌ 4–0–42–0, బ్రేస్‌వెల్‌ 1–0–8–1, ఫెర్గూసన్‌ 4–0–54–0, టిక్నర్‌ 3–0–50–1, ఇష్‌ సోధి 3–0–34–1, సాన్‌ట్నర్‌ 4–0–37–0, మిచెల్‌ 1–0–6–1. **న్యూజిలాండ్‌ ఇన్నింగ్స్‌:** అలెన్‌ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్‌్షదీప్‌ 1; చాప్‌మన్‌ (సి) ఇషాన్‌ (బి) అర్‌్షదీప్‌ 0; ఫిలిప్స్‌ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్‌ (సి) మావి (బి) ఉమ్రాన్‌ 35; బ్రేస్‌వెల్‌ (బి) ఉమ్రాన్‌ 8; సాన్‌ట్నర్‌ (సి) సూర్య (బి) మావి 13; ఇష్‌ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్‌ (సి) ఉమ్రాన్‌ (బి) పాండ్యా 0; టిక్నర్‌ (సి) ఇషాన్‌ (బి) పాండ్యా 1; లిస్టర్‌ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్‌) 66. వికెట్ల పతనం:** 1–4, 2–4, 3–5, 4–7, 5–21, 6–53, 7–53, 8–54, 9–66, 10–66. **బౌలింగ్‌:** హార్దిక్‌ పాండ్యా 4–0–16–4, అర్‌్షదీప్‌ సింగ్‌ 3–0–16–2, ఉమ్రాన్‌ మాలిక్‌ 2.1–0–9–2, కుల్దీప్‌ యాదవ్‌ 1–0–12–0, శివమ్‌ 2–0–12–2.

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్‌ గిల్‌ (126 నాటౌట్‌) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్‌; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్‌ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్‌ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్‌ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్‌ రాహుల్‌, రోహిత్‌, కోహ్లి ఈ ఘనత సాధించారు.

ఆంధ్ర 379 ఆలౌట్‌

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్‌ చేసిన విహారి



విహారి

ఇండోర్‌: డిఫెండింగ్‌ చాంపియన్‌ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్‌ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్‌ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్‌ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్‌ రెండు వికెట్లు తీయగా... నితీశ్‌ కుమార్‌ రెడ్డి, పృథ్వీరాజ్‌ ఒక్కో వికెట్‌ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్‌ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్‌ (149; 18 ఫోర్లు, 1 సిక్స్‌) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్‌ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్‌ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్‌ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్‌ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్‌ లలిత్‌ మోహన్‌ (22 నాటౌట్‌; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్‌ జైన్‌ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ ముగిసింది.

జాతీయ స్కూల్స్‌ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు



యశ్వి జైన్‌

సాక్షి, హైదరాబాద్‌: జాతీయ స్కూల్స్‌ చెస్‌ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్‌–15 బాలుర విభాగంలో వేముల అద్వైత్‌ విష్ణుశ్‌ (7.5 పాయింట్లు)... అండర్‌–15 బాలికల విభాగంలో యశ్వి జైన్‌ (7 పాయింట్లు)... అండర్‌–13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్‌–11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్‌–9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్‌–7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్‌ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్‌–7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్‌ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్‌ సంఘం అధ్యక్షుడు కేఎస్‌ ప్రసాద్‌ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్‌



బ్యాంకాక్‌: థాయ్‌లాండ్‌ ఓపెన్‌ సూపర్‌–300 బ్యాడ్మింటన్‌ టోర్నీలో హైదరాబాద్‌ ప్లేయర్‌ సాయిప్రణీత్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్‌ 21–13, 21–14తో మాడ్స్‌ క్రిస్టోఫర్సన్‌ (డెన్మార్క్‌)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్‌ జార్జి (భారత్‌) 21–17, 19–21, 23–21తో చెయుక్‌ యి లీ (హాంకాంగ్‌)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్‌ వర్మ, ప్రియాన్షు రజావత్‌, మిథున్‌ మంజునాథ్‌ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21–14, 19–21, 25–27తో హియో క్వాంగ్‌ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్‌ వర్మ 14–21, 16–21తో లీ షి ఫెంగ్‌ (చైనా) చేతిలో.. మిథున్‌ 18–21, 12–21తో నిషిమోటో (జపాన్‌) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్‌ డబుల్స్‌ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్‌ కపూర్‌ జోడీ 21–11, 21–16తో టి అలెగ్జాండర్‌–జోసెఫిన్‌ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరింది.

సినిమా



రజనీకాంత్‌

జైసల్మేర్‌లో జైలర్‌

రాజస్తాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్‌'. రజనీకాంత్‌ హీరోగా నెల్సన్‌ దిలీప్‌కుమార్‌ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్‌'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్‌ కుమార్‌ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్‌ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్‌' చిత్ర యూనిట్‌ ఇప్పుడు 'జైసల్మేర్‌'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్తాన్‌లో ల్యాండ్‌ అయ్యారు రజనీకాంత్‌. ఈ షెడ్యూల్‌ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్‌ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్‌ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...



● కమల్‌హాసన్‌

హెలికాప్టర్‌లో షూటింగ్‌ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్‌. 1996లో హీరో కమల్‌హాసన్‌, దర్శకుడు శంకర్‌ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్‌' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్‌ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్‌. కాగా కమల్‌ హెలికాప్టర్‌ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్‌, షూటింగ్‌ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్‌ ఇలా హెలికాప్టర్‌ రైడ్‌ చేస్తున్నారన్నది కోలీవుడ్‌ టాక్‌. కాజల్‌ అగర్వాల్‌ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్‌, రకుల్‌ప్రీత్‌సింగ్‌, బాబీ సింహా కీ రోల్స్‌ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.

పల్లెటూరి ప్రేమ



● 'శశివదనే'లో ఓ దృశ్యం

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్‌ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌ లుక్‌ను 'దిల్‌' రాజు విడుదల చేశారు. వైభవ్‌ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్‌ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్‌ అసిస్టెంట్‌ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్‌ లవ్‌ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

– శౌరి చంద్రశేఖర్‌ టి. రమేష్‌

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్‌ టి. రమేష్‌. అనిఖా సురేంద్రన్‌, సూర్య వశిష్ఠ, అర్జున్‌ దాస్‌ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్‌ టి.రమేష్‌ మాట్లాడుతూ– ''రామ్‌ గోపాల్‌ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్‌ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్‌ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్‌ పాయింట్‌ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.



● శౌరి చంద్రశేఖర్‌



● విజయ్‌, త్రిష

పదిహేనేళ్ల తర్వాత....

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్‌– హీరోయిన్‌ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్‌ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్‌, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్‌ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్‌ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్‌ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్‌ ప్రకటించింది. దీంతో విజయ్‌, త్రిష ఐదోసారి స్క్రీన్‌ షేర్‌ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్‌' తర్వాత హీరో విజయ్‌, దర్శకుడు లోకేష్‌ కనగరాజ్‌ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్‌ దత్‌, ప్రియా ఆనంద్‌, అర్జున్‌ సర్జా, గౌతమ్‌ మీనన్‌ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్‌.

వింతగా మారబోతోంది



● బ్రహ్మానందం

తరుణ్‌ భాస్కర్‌ దాస్యం దర్శకత్వంలో భరత్‌ కుమార్‌, శ్రీపాద్‌ నందిరాజ్‌, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్‌ కౌశిక్‌, సాయికృష్ణ గద్వాల్‌, విజయ్‌ కుమార్‌ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్‌ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్‌ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్‌ భాస్కర్‌.

తెరపైకి జాక్సన్‌ జీవితం

పాప్‌ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్‌ జాక్సన్‌ జీవితంతో 'మైఖేల్‌' పేరుతో బయోపిక్‌ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్‌ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్‌ కుమారుడు జాఫర్‌ జాక్సన్‌ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్‌ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్‌. ''మైఖేల్‌ జాక్సన్‌ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్‌ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్‌ జాక్సన్‌ 2009 జూన్‌ 25న మరణించిన విషయం తెలిసిందే.



● మైఖేల్‌



● జాఫర్‌

లవ్‌.. యాక్షన్‌



● రక్షిత్‌, కోమలి

రక్షిత్‌ అట్లూరి, కోమలీ ప్రసాద్‌ జంటగా సాయి మోహన్‌ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్‌ కానుంది. శరవణ వాసుదేవన్‌ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్‌ సాంగ్‌ని డైరెక్టర్‌ హరీష్‌ శంకర్‌ రిలీజ్‌ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్‌, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్‌, యాక్షన్‌ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్‌. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌: శ్రీపాల్‌ చోలేటి, కెమెరా: సాయికుమార్‌.

అయోమయంలో...



● రణధీర్‌, శుభశ్రీ

రణధీర్‌, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్‌ ప్రసాద్‌ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్‌ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్‌ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్‌ క్రైమ్‌ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్‌ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్‌, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited Sakshi Press, Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division, Tirupati Dist - 517 520, and Printed at Jagati Publications Limited Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division, Tirupati Dist - 517 520 Editor: V. Murali (Responsible for selection of News under the PRB Act) Phone No.0877-2275378 Fax No. 0877-2271213, RNI Regn No. APTEL/2008/23805.